భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 30.0

కనిష్ఠం : 24.0

వెంటాడుతున్న విచారణ

- భీమవరం మున్సిపాలిటీలో అక్రమ పన్నులు
- ఒకరి ఆస్తిపై మరొకరి పేరుతో పన్ను
- బాధితుడి ఫిర్యాదుతో విచారణకు ఆదేశాలు

భీమవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):భీమవరం మున్సిపాలిటీలో ఒకరి ఆస్తిపై మరొకరి పేరుతో పన్ను వేసిన వ్యవహారంలో విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. మూడు నెలల్లోగా తుది నివేదిక సమర్పించాలని స్పష్టంచేసింది. మున్సిపల్ పరిపాలన శాఖ అదనపు డైరెక్టర్ పి.మురళీకృష్ణగౌడ్ విచారణాధికారిగా నియమితులయ్యారు. అక్రమ పన్ను వ్యవహారంలో భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఎస్.శివరామకృష్ణ, రెవెన్యూ అధికారి డి.సోమశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, వార్డు సంక్షేమ కార్యదర్శి పి.చంద్రశేఖర్‌లను బాధ్యులుగా ప్రభుత్వం గుర్తించింది. సదరు ఖాళీ భూమిపై అప్పటికే అసలు యజమానులు పన్ను చెల్లిస్తున్నారు. దానిని వేరొకరి పేరుతో పన్ను వేస్తూ గత అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో రూ.80 వేలు పన్ను వసూలు చేయాల్సి ఉంది. అలా కాకుండా ఉచితంగానే వేరొకరికి అసెస్‌మెంట్ నెంబర్ ఇచ్చేశారు. దీని ఆధారంగానే నర్సాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమార్కులు తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇది తెలుసుకున్న అసలు భూయజమానులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలోనే విచారణ చేసి తప్పు జరిగినట్టు ప్రభుత్వం గుర్తించింది. తాజాగా అదనపు డైరెక్టర్‌ను మరోసారి దర్యాప్తు చేసేందుకు నియమించారు. మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. తదనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

నేటి నుంచి పంటు రాకపోకలు

నరసాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):తుఫాన్ కారణంగా నరసాపురం-సఖినేటిపల్లి రేవుల మధ్య నిలిచిన పంటు రాకపోకలను శుక్రవారం నుంచి పునరుద్ధరించనున్నారు. ఐదు రోజులుగా గోదావరిలో రాకపోకలు నిలిచి పోవడంతో ప్రజలు చించినాడ వంతెన మీదుగా వెళుతున్నారు. తుఫాన్ వీడినప్పటికీ పంటు, పడవలను మరో ప్రదేశానికి తరలించడంతో వాటిని గురువారం సాయంత్రానికి గోదావరిలోకి తీసుకొచ్చారు. శుక్రవారం నుంచి యధావిధిగా రాకపోకలు సాగుతాయని ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు.



మాధవరం-కంసాలిపాలెం మధ్య రాకపోకలు బంద్

నిడదవోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):కంసాలిపాలెం తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య బుధవారం ఎర్రకాలువ నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో రాకపోకలను అధికారులు బంద్ చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కొంగువారిగూడెంలోని ఎర్రకాలువ జలాశయానికి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరుతుండడంతో అధికార్లు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కంసాలిపాలెం మాధవరం మధ్య ఎర్రకాలువ నీటి ప్రవాహం ఉధృతి పెరిగింది. తహశీల్దార్ నాగరాజు నాయక్, ఎంపీడీవో జగన్నాథరావు ఆ ప్రాంతాలను పరిశీలించి రెండు గ్రామాల మధ్య రాకపోకలను నిలిపివేసినట్లు ప్రకటించారు.



పెంటపాడు మండలం చిలకంపాడు లాకుల వద్ద పడిపోయిన వరిచేలు..



రావిపాడులో వరి చేలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే బొలిశెట్టి

తుఫాన్ వీడింది నష్టం తేలింది !

జిల్లాలో నష్టం ప్రాథమిక అంచనా రూ.230 కోట్లు

- పట్టణాలు, పల్లెల బాట పట్టిన అధికారులు
- వరి, ఉద్యాన పంటలపై రూ.185 కోట్లు
- ఆర్‌అండ్‌బీ రహదారులకు రూ. 35 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.8.50 కోట్లు నష్టం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వరుస వర్షాలు, తెగుళ్లతో కుదేలై.. నష్టాల పాలైన రైతులపై మొంథా తుఫాన్ గోరు చుట్టుపై రోకలి పోటులా మారింది. వేలాది మంది రైతులకు కోట్లాది రూపాయల విలువైన పంటను కోల్పోయారు. అసలే అంతంత మాత్రంగా వున్న రోడ్లు.. తుఫాన్ దెబ్బకు మరింత ఛిద్రమయ్యాయి. ఇప్పటికే వున్న పాత రోడ్ల ఖర్చుకు ఇది మరింత అదనంగా పెరిగింది. ఇప్పటికే తుఫాన్ భయం వీడగా, జరిగిన నష్టాలను అంచనా వేసేందుకు అధికారులు గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు.. మొంథా తుఫాను మిగిల్చిన నష్టాలపై జిల్లా అధికారులు ప్రాథమికంగా లెక్క తేల్చారు. జిల్లా మొత్తం మీద వ్యవసాయ, ఉద్యాన, రోడ్లు, విద్యుత్ తదితర విభాగాల్లో సుమారు రూ.230 కోట్ల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. మరిన్ని నష్టాలను అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 33,630 ఎకరాల్లో వరి పంటకు, 750 ఎకరాల్లో ఉద్యాన పంటలైన అరటి, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. 93 ఇళ్లు దెబ్బతినగా, 700 చెట్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. వీటి నిమిత్తం రూ.185 కోట్లు నష్టం జరిగినట్లు అంచనా వేశారు. 33 కేవీ ఫీడర్స్ 55, 11 కేవీ ఫీడర్స్ 415తోపాటు 36 సబ్‌స్టేషన్‌లు తుఫాను దాటికి దెబ్బతిన్నాయి. ఇక విద్యుత్ స్తంభాలు, వైర్లతో కలిపి మొత్తం రూ.8.5 కోట్లు నష్టపోయినట్టు విద్యుత్ శాఖ అంచనాకు వచ్చింది. జిల్లాలో 278 కిలోమీటర్ల మేర 58 రహదారులు ఛిద్రమైనట్టు ఆర్‌అండ్‌బీ అధికారులు లెక్క తేల్చారు. వీటి పునరుద్ధరణకు దాదాపు రూ.35 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. నష్టాల్లో ప్రధాన పంట వరి వుంది. వీరికి ప్రభుత్వం పెట్టుబడి రాయితీ మంజూరు చేసేలా ఆన్‌లైన్‌లో రైతుల పేర్లను నమోదు చేస్తున్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన రైతులు, కౌలు రైతుల పేర్లను ప్రామాణికంగా తీసుకున్నారు. అలాగే ఉద్యాన పంటలకు పరిహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. నేలకూలిన చెట్లను మునిసిపాలిటీ, పంచాయతీ, పారిశుధ్య సిబ్బంది వేగవంతంగా తొలగించారు. తుఫాన్ తీవ్రత తక్కువగా ఉండడంతో నష్టాలు తక్కువగా నమోదయ్యాయి. దీనితో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

వరిపై తుఫాన్ తెగుళ్లు..!

భీమవరం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):వరిపై మొంథా తుఫాన్ ప్రభావంతో తెగుళ్లు విజృంభించేలా వున్నాయి. ఇప్పటికే గడిచిన వారం రోజులుగా పెద్ద మొత్తంలో వరి పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఈదురుగాలులకు పనలన్నీ నేలనంటాయి. వర్షాలకు దెబ్బతిన్న 26 వేల 400 ఎకరాల్లోని పంటలకు తెగుళ్లు సోకే అవకాశం వున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. మండలాల వారీగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో సార్వా సాగవుతుండగా ఈనిక దశలో ఉన్న చేలకు దోమపోటు, మానిపండు, ఆకుముడత, తెగుళ్లు వస్తాయి. పొట్ట దశలో ఉన్న చేలకు బ్యాక్టీరియా ఎండాకు తెగులు, పొడ తెగులు, ఊచపోట్టు వచ్చే అవకాశం ఉంది. వీటి నివారణకు తొలుత వరి చేలల్లోని నీటిని బయటకు పంపాలి. ఆ తర్వాత పురుగుల మందులు పిచికారి చేయాలి. నేల వాలిన వరి చేలను సాధ్యమైంత వరకు కట్టలుగా కడితే దిగుబడి తగ్గే ప్రమాదం తప్పుతుంది. చేను పరిస్థితిని బట్టి పురుగు, తెగుళ్లు, ఉధృతిని బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

- బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు ప్లాంటోమైసిన్ 1 మి.లీ, కాపర్ హైడ్రాక్సైడ్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మాగుడు తెగులు నివారణకు హెక్సాకోనోజోల్ మందు ఎకరానికి 400 మి.లీ. పిచికారీలో చేయాలి.
- దోమపోటు, మాగుడు తెగులు, మానిపండు నివారణకు ప్రోపికొనజోల్ 200 మి.లీ. పై మెట్రోజోన్ 120 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.
- ఆకుముడత పురుగుకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు పిచికారీ చేయాలి. ఇంకా ఏమైనా సందేహాలు వుంటే దగ్గరలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

ఏలూరులోకి గణపవరం !

- ఒక నియోజకవర్గం.. ఒకే రెవెన్యూ డివిజన్‌లోకి మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- పశ్చిమలోనే ఉంటామంటున్న మండల ప్రజలు.. ఇప్పటికే మంత్రులు, కలెక్టర్‌కు వినతి
- జిల్లాల పునర్విభజనలో మార్పులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఒక నియోజకవర్గం మొత్తం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండేలా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం ఏలూరు జిల్లాలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఉంగుటూరు నియోజకవర్గం మొత్తాన్ని ఏలూరు జిల్లాలో వుంచారు. ఇందులో గణపవరం మండల ప్రజలు తమను పశ్చిమ గోదావరి జిల్లాలో వుంచాలని ఇక్కడకు వచ్చిన అప్పటి సీఎం జగన్ దృష్టికి తీసుకుని వెళ్లారు. అప్పటికే పలు ఆందోళనలు చేపట్టారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఆయన మండలాన్ని పశ్చిమలోకి కలుపుతున్నట్టు ప్రకటించారు. తర్వాత కొన్ని నెలలకు జీవో జారీచేశారు. భీమవరం రెవెన్యూ డివిజన్‌లో గణపవరం మండలాన్ని కొనసాగించారు.


రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల విభజన అప్పట్లో శాస్త్రీయంగా జరగలేదని వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కూటమి నేతలు నిర్ధారించారు. ఈ మేరకు జిల్లాల పునర్విభజన చేయాలని మంత్రుల కేబినెట్ కమిటీని ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ చేపట్టింది. కమిటీ సూచనల మేరకు 'ఒక నియోజకవర్గం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండే విధానాన్ని ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంది. ఈ లెక్కన గణపవరం మండలం మళ్లీ ఏలూరు జిల్లాలో కలిసే అవకాశం ఉంది. దీనిపై మండలంలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గణపవరం మండలంలో పలువురు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. గణపవరం మండల గ్రామాలన్నీ భీమవరానికి పట్టణానికి దగ్గరగా ఉంటాయని, తమను ఏలూరు జిల్లాలో కలపవద్దని కోరుతున్నారు.

మరోవైపు ఏలూరు జిల్లా నూజివీడు, కైకలూరు, నియోజకవర్గాలు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోకి, తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలోకి మారవచ్చని ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పష్టత రావాల్సి వుంది.

12 పాఠశాలలకు పీఎం శ్రీ

- ఒక్కో స్కూల్‌కు 30 చొప్పున 330 ట్యాబ్‌ల పంపిణీ
- ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు బోధన

భీమవరం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):విద్యా బోధనలో ఎన్నో మార్పులు తీసుకువస్తున్న కూటమి ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో పర్సనలైజ్డ్ ఎడాప్ట్ లెర్నింగ్(పాల్) ల్యాబ్‌లను ఏర్పాటు చేయనుంది. ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) కింద జిల్లాలోని 12 పాఠశాలలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. వీటిలో గూట్లపాడు(భీమవరం), శివదేవుని చిక్కాల(పాలకొల్లు), కలవపూడి(కాళ్ల), బల్లిపాడు (అత్తిలి), కవిటం(పోడూరు), చినకాపవరం(ఆకివీడు), మోగల్లు (పాలకోడేరు), మార్టేరు(పెనుమంట్ర), ఇరగవరం, ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పెంటపాడు బాలికల ఉన్నత పాఠశాల, ఎల్‌బీ చర్ల జూనియర్ కళాశాల(నరసాపురం) పీఏఎల్ ల్యాబ్‌లకు ఎంపికయ్యాయి. వీటిలో ఒక్కో పాఠశాలకు 30 ట్యాబ్‌ల చొప్పున మొత్తం 330 ట్యాబ్‌లు అందిస్తారు. ఆయా పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులపై ట్యాబ్‌ల ద్వారా అవగాహన పెంచుకునేందుకు రోజూ రెండు గంటలపాటు సమయం కేటాయిస్తారు. ఆ ట్యాబ్‌లలో ఆయా సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యాంశాలు ఉంటాయి. విద్యార్థులు ట్యాబ్ ఓపెన్ చేసి పాఠ్యాంశాల ప్రశ్నలకు జవాబులు చెప్పాలి. దానిని బట్టి సబ్జెక్టుపై విద్యార్థికి వున్న పట్టు తెలుస్తుంది. ట్యాబ్‌లను పాఠశాలల్లోనే ఉపయోగించాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ముందు ఈ పాఠశాలల్లో వచ్చే నెల మొదటి వారం నుంచి అమలు చేస్తుంది.



సీపీఎం నాయకుడు బాబూరావు కన్నుమూత

- పార్థివ దేహాన్ని ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాలకు అప్పగింత



7



తీరం ప్రశాంతం

సాధారణ స్థితికి వాతావరణం.. జనజీవనం

పేరుపాలెం బీచ్‌లో కొనసాగిన పోలీస్ బందోబస్తు

6

భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదు

భారీగా గంజాయి స్వాధీనం

7

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌పై స్పష్టత ఇవ్వాలి : ఫ్యాప్టో నాయకుల డిమాండ్


పొంగిపొర్లుతున్న కన్నాపురం తూర్పుకాల్వ

మొంథా విలయం సృష్టించి వెళ్లిపోయింది. తుఫాన్ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పాలు పోసుకునే దశలో ఉన్న చేలు నేల నంటాయి. అరటి చెట్లు సగానికి విరిగిపడ్డాయి. తమలపాకుల తోటలు నేలవాలాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మరోపక్క గురువారం ఉదయం కురిసిన వర్షానికి ఏజెన్సీలో వాగులు పొంగిపొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వివిధ ప్రాంతాల్లో రహదారులు ఛిద్రమయ్యాయి.


ముదినేపల్లి మండలం పెదకామనపూడిలో నేలవాలిన వరి చేను

మొంథా మిగిల్చిన క(న)ష్టం

ఏజెన్సీలో కుండపోత.. పొంగిన కొండవాగులు



పోలవరం/ బుట్టాయగూడెం/ లింగపాలెం/ కొయ్యలగూడెం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ మూడు రోజుల పాటు ఏజెన్సీలో మోస్తరు వర్షాలు మాత్రమే కురవగా తుఫాను తీరం దాటిన తర్వాత బుధవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారు జామువరకు కుండపోత వర్షం కురిసింది. ఏజెన్సీలో పలుచోట్ల కొండవాగులు పొంగి ప్రమాదకరస్థాయిలో ప్రవహించాయి. పోలవరం మండలంలో బుధవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. గుంజవరం, తానాలకుంట, కొవ్వాడ కాలువలు కల్వర్టులపై పొంగి ప్రవహించాయి. కొత్తపట్టిసీమ, గూటాల, పట్టిసీమ గ్రామాలలో ఏటిగట్టు దిగువన నివాసాలలోకి వర్షపు నీరు చేరి ప్రజానీకం అవస్థలకు గురయ్యారు.

- బుట్టాయగూడెం మండలం కెఆర్ పురం తూర్పు కాలువ, కన్నాపురం పడమట కాలువలు పొంగి ప్రవహించాయి. దీంతో గంటల తరబడి జనాలు వాగుల వద్దనే వేచి ఉన్నారు. కెఆర్ పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, స్పెషల్ ఆఫీసర్ టి.లత, తహసీల్దార్ చల పతిరావు, మండల పార్టీ అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది జనాలు వాగులు దాటకుండా అప్రమత్తం చేశారు.
- లింగపాలెం, కామవరపుకోట మండలాలను కలిపే గుండేరు వాగుకు వరదనీరు భారీగా రావడంతో అధికారులు అప్రమత్తమ య్యారు. వంతెనపై నుంచి నాలుగు అడుగులమేర వరదనీరు పోటెత్తడంతో లింగపాలెం తహసీల్దార్ నజీముల్లాషా, ఎస్ఐ కేవెంకన్నలు వాగు వద్ద పరిస్థితిని సమీక్షించి ఈ మార్గంలో రాకపోకలు సాగించకుండా కంచె వేశారు. ఈ వంతెనపై నుంచి రాకపోకలు ఆగిపోవడంతో రెండు మండలాలకు చెందిన గ్రామస్తులు, రైతులు, ఇబ్బందులకు గురయ్యారు. వరదనీటి ప్రవాహానికి వంతెన పూర్తిగా ధ్వంసమవ్వడంతో అధికారులు వాహనాలను నిలిపివేసి ప్రమాదకరంగా వాగును దాటేందుకు ప్రయత్నించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.
- ఏజెన్సీలో బుధవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. కన్నాపురం తూర్పు, పడ మర కాల్వలు ఉధృతంగా ప్రవహించాయి. అటు పోలవరం, ఇటు బుట్టాయిగూడెం వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొండ ప్రాంతాల నుంచి వచ్చే జైనేరు వాగు కూడా ఉధృతంగా ప్రవహించింది. చుట్టుపక్కల పంట పొలాల్లోకి వరదనీరు చేరింది. కొయ్యల గూడెం నుంచి కన్నా పురం వెళ్లే రహదారి పొంగుటూరు నుంచి యర్నగూడెం వెళ్లే రహదారి చెరువులను తలపించేలా వరదనీరు చేరింది.దిప్ప కాయల పాడు, బయ్యన్నగూడెం, పరింపూడి, పొంగుటూరు గ్రామాల్లో వరి చేలు నీటమునిగాయి. మండలంలో 720 ఎక రాల్లో వరి పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు.


ఉధృతంగా గుండేరువాగు

ధ్వంసమైన రహదారులు

ఆచంట/నిడమర్రు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కారణంగా పలు ప్రధాన రహదారులు ధ్వంసం అయ్యాయి. ఆచంట పోలీసు స్టేషన్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు కొత్తగా ఏర్పాటు చేసిన మినీ బైపాస్ రహదారి ప్రస్తుతం పెద్ద పెద్ద గోతులు పడి చెరువు ను తలపిస్తుంది. నిత్యం ఈ రహదారి వెంబడి అనేక వాహ నాలు వెళుతుంటాయి.మండలంలో కోడేరు వద్ద, కొడమంచిలి కచేరి సెంటర్ నుంచి వేమవరం వెళ్ళే రోడ్డు ఇంకా పలు చోట్ల రహదారులు వర్షాలకు ధ్వంసం అయ్యి అధ్వానంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప లువురు కోరుతున్నారు.

నిడమర్రు నుంచి పెదనిండ్రకొలను గ్రామానికి సుమారు 5కి.మీ ఉంటుంది. తోకలపల్లి నుంచి మండల కేంద్రానికి రావాలంటే ఇదే ప్రధాన రహదారి. ఈ రహదారిపై తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి, ఫత్తేపురం, పెదనిండ్రకొలను, దేవర గోపవరం గ్రామాల ప్రజలు ఆధారపడి ఉన్నారు. సుమారు 6 గ్రామాల నుంచి సుమారు 20 వేల జనాభాకు ఈ రహదారి ప్రధానమైనది. ఈ రహ దారి గోతుల వల్ల రాత్రిపూట ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గణపవరం , భీమవరం, తాడేపల్లిగూడెం వెళ్లి చదువు నేర్చుకొనే చిన్నారులు స్కూల్ బస్సులలో ప్రయాణిస్తుంటే గోతుల వల్ల బస్సు ఎగరేసి పడేయడంతో మెడ, నడుము నొప్పితో బాధపడుతున్నారు. స్థానిక ప్రజానిధులు స్పందించి తక్షణం రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


నిడమర్రు నుంచి పెదనిండ్రకొలను వెళ్లే రోడ్డులో మోకాలు లోతులో నిలిచిపోయిన రహదారి


చెరువును తలపిస్తున్న పొంగుటూరు- యర్నగూడెం రహదారి


ధ్వంసమైన ఆచంట పోలీసుస్టేషన్-మార్కెట్ సెంటర్‌కు వెళ్లే రోడ్డు

పంటలకు తీరని నష్టం


అయోధ్యలంకలో తుఫాన్ దాటికి పడిపోయిన అరటి తోటలు

పెంటపాడు/ఆచంట/కాళ్ల/ నరసాపురం రూరల్/ ఆగిరిపల్లి/ మండవల్లి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు మండలంలో 3 వేల ఎకరాల్లో వరిచేలు పడిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పడిపోయిన పనలను పైకి లేపి కట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పంటనష్టాన్ని అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొన్ని చేలు వర్షపునీటిలోనే ఉన్నాయి. ఇవి మొలకగా మారితే రైతులకు నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. ఆచంట మండలంలో చాలా ఎకరాల్లో వరి పంట నేలకొరిగి రైతులకు నష్టాన్ని మిగిల్చింది. లంక గ్రామాల్లో అరటి తోట పడిపోయింది. కొన్నిచోట్ల తమలపాకుల తోటలు నేలనంటాయి. అయోధ్యలం కలో సుమారు 30 ఎకరాల్లో తమల పాకులతోటలు,సుమారు 150 ఎకరాల్లో అరటి తోట పడిపోయి రైతులకు నష్టాన్ని మిగిల్చింది. తమను ఆదుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. కాళ్ళ మండలంలో 3,700 ఎకరాల్లో సాగు జరుగుతుందని, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటను అంచనా వేస్తు న్నామని ఏవో రమేష్‌నాయుడు తెలిపారు. నరసాపురం రూరల్ మండలంలో ప్రాథమిక సర్వే ప్రకారం 6,500 ఎకరాల్లో వంట నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఆక్వా నష్టాన్ని కూడా సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ఆగిరిపల్లి మండ లంలో 349 హెక్టార్లలో మినుము, 89 హెక్టార్లలో వరి, 20 హెకార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. మండవల్లి మండలం లోని ఏడు గ్రామాల్లో 1,352 ఎకరాల్లో పంట నష్టం జరినట్టు అధికారులు తెలిపారు.


ఆచంట మండలం అయోధ్యలంకలో పడిపోయిన తమలపాకుల తోటలు


ముదినేపల్లి మండలం పెదపాలపర్రులో మునిగిన వరి


గణపవరంలో వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ధర్మరాజు

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

వరిచేలను పరిశీలించిన పశ్చిమ కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు

గణపవరం/ పెంటపాడు/ తాడేపల్లిగూడెం రూరల్, ఆచంట, పెనుమంట్ర అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా దెబ్బ తిన్న పంటనష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించి బాధిత రైతులకు సహాయం అందేలా చూస్తామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. గురువారం మునిగిన పంట పొలాలను ఆమె పరిశీలించారు. గణపవరం మండలంలోని సీహెచ్ అగ్రహారం, కాశీపాడు, ఏ.గోపవరం, వీరేశ్వరపురం గ్రామాల్లో వరి పంటలను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం వరిపంట పొట్టదశలో ఉందని యంత్రాలతో పంటలు కోసే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల ద్వారా పంట కోయిస్తే అదనపు ఖర్చులవుతాయని దీనికి తోడు దిగుబడులు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ వరిసాగు చేసిన రైతులు ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయారని నేలకొరిగిన వరిపంటను కలెక్టర్‌కి చూపించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవ సాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా సహకార శాఖాధికారి మురళీ కృష్ణ, తహసీల్దార్ అప్పారావు పాల్గొన్నారు. రావిపాడు గ్రామంలో వర్షాలకు పడిపోయిన చేలను ఎమ్మెల్యే శ్రీని వాస్, వలవల బాబ్జీలతో కలసి పరిశీలించిన అనంతరం సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పండించిన ప్రతీ గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతు లెవ్వరూ ఆందోళన చెంద వద్దన్నారు. సొసైటీ చైర్మన్ ములగాల శివ, ఆర్డీవో ఖతీబ్ కౌసర్‌బనో, గొర్రెల శ్రీధర్, పుల్లా బాబి, కిలపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెంలో దెబ్బతిన్న వరిచేలను పరిశీలించారు. తహసీల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ఆచంటలో పడిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు, ఏడీ మురళీకృష్ణ

పంట నష్టం యాప్‌లో నమోదు చెయ్యండి

ఆచంట, పెనుమంట్ర మండలంలోని పలు గ్రామాల్లో పడి పోయిన పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వర రావు, ఏడీ మురళీకృష్ణ , ఏవో నాగరాజులు కలిసి పరిశీలించారు. పంట నష్టం వివరాలను వెంటనే తయారు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ముంపుకు గురైన వరి చేలలో నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని పూత దశ నుంచి గింజ గట్టిపడే దశలో పడిపోయిన వరిచేలను కట్టలుగా కట్టుకోవాలని రైతులకు వివరించారు. పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఏఈవోలకు రైతుల వివరాలను యాప్‌లో ఏ విధంగా చేస్తున్నారు ? ఎలా చెయ్యాలి ? అనే విషయాలను వివరిం చారు. వివరాలను త్వరితగతిన యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ముందుచూపుతో ముంపు తప్పింది !

డ్రెయిన్ల ప్రక్షాళనతో ఉండి నియోజకవర్గానికి తగ్గిన వరద ముంపు

ఫలిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చర్యలు

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు, ప్రజలు

ఆకివీడు రూరల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ముందు చూపుతో ముంపు తప్పించారని ఉండి నియోజకవర్గంలోని ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2024లో ఆయన ఎమ్మెల్యే అయిన నాటి నుంచి నియోజకవర్గంలోని పంట, మురుగు కాలువలు ప్రక్షాళనపై దృష్టి పెట్టారు. ఉండి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ ఫండ్ ఏర్పాటు చేసి దాతల సహకారంతో కాలువల ప్రక్షాళన చేపట్టారు. ఆక్రమణలు, ఏళ్ళ తరబడి పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. సాగునీరు, తాగునీరు అందించే వెంకయ్యవయ్యేరు, ఉండి కాలువలలో తూడు, గుర్రపుడెక్కలను తొలగించి నీటిఎద్దడి లేకుండా చేశారు. వాటికి అనుసంధానంగా ఉన్న కాలువలను శుభ్రం చేశారు. ఏళ్ల తరబడి ఆధునికీకరణకు నోచుకోని డ్రెయిన్ల ప్రక్షాళన ప్రారంభించారు. ఆకివీడు మండలంలోని రుద్రాయకోడు, చినకాపవరం, ఉప్పుటేరులో కిక్కస, గుర్రపుడెక్క, తొలగించే పనులు ప్రారంభించారు. కాళ్ళ మండలంలోని మొగదిండితో పాటు బొండాడ పంటకాలువ సుమారు 23 కి.మీ మేర ప్రక్షాళన చేశారు. బౌండరీ కోడు, దుబ్బల కోడు, చిలుకూరు, మహదేవపట్నం డ్రైన్‌లు రక్కీసుకోడు, ఇస్సుకోడు, మైనర్ డ్రైన్‌లు, బొండాడ , ఓల్డ్‌వై మేజర్ డ్రైన్‌లు ప్రక్షాళన పూర్తయ్యాయి. మిగిలిన డ్రైన్‌లు పనులు ప్రారంభించనున్నారు. జల్లి కాకినాడ, యండగండి, నీలకోడు డ్రైన్‌లు ప్రక్షాళన పూర్తయ్యాయి. కొల్లేరు వరద ముంపు నీటిని నేరుగా సముద్రంలోకి తీసుకెళ్ళే ఉప్పు టేరులో తూడు, కిక్కస తొలగించే పనులు ప్రారంభమ య్యాయి. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి ఉప్పుటేరు డ్రెడ్జింగ్ పనులు చేపట్టడానికి కృషి చేస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో వరద ముంపు ఇబ్బం దులు లేకుండా చేశారని ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


రుద్రాయకోడు ప్రక్షాళన పనులు (ఫైల్)

ముంపు బారినుంచి గట్టెక్కాం



పంట, మురుగుకాలువలు ఆక్రమణలు తొలగించి బాగు చెయ్యడంతో వరద ముంపు బారినుంచి గట్టెక్కాం. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ముందు చూపుతో ముప్పు తప్పింది. అధికవర్షాలు, తుఫాను ఎఫెక్టు ఉన్నప్పటికి ప్రశాంతంగానే ఉన్నాం. కురిసిన వర్షపు నీరు నేరుగా మురుగు కాలువలలోనికి వెళ్ళి సముద్రంలోకి వెళ్లిపోతున్నది.

సాగిరాజు సోమరాజు, మాలవానితిప్ప


పుష్కలంగా సాగు, తాగునీరు



కాలువ శివారు, కొల్లేరు తీరప్రాంతం కావడంతో సాగు, తాగునీటి ఎద్దడి ఉండేది. ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు పాతవయ్యేరు లోని తూడు, గుర్రపు డెక్కను తొలగించేశారు. ప్రస్తుతం శివారు గ్రామాలకు తాగు, సాగునీరు పుష్కలంగా ఉంది. కాలువలలోని నీరు కలుషితమవ్వకుండా, ఆక్వా చెరువుల నీరు కాలువలలో వదలకుండా చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది.

గురువెల్లి రఘు ప్రసాద్, కళింగగూడెం

తీరం ప్రశాంతం


పీఎం లంక వద్ద సముద్రం

తెరిపిచ్చిన వాతావరణం

సాధారణ స్థితికి జనజీవనం

పేరుపాలెం బీచ్‌లో కొనసాగిన పోలీస్ బందోబస్త్

నరసాపురం/ మొగల్తూరు, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఐదు రోజులుగా తుఫాన్ ప్రభావంతో అల్లకల్లోలంగా మారిన సముద్రం ప్రశాంతంగా మారింది. పరిస్థితులు సాధారణ స్థితికి రావడంతో జనజీవనం తేరుకుంది. ఇళ్లకే పరిమితమైన ప్రజలు నిత్యవసరాల కోసం బయటకొచ్చారు. గాలులకు ధ్వంసమైన విద్యుత్ వైర్లు, స్థంబాలను పునరుద్ధరించ డంతో గ్రామాల్లో లైట్లు వెలిగాయి. పునరావాస కేంద్రాలు ఖాళీ అయ్యాయి. ఇటు మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. చినలంక వద్ద కోతకు గురైన గట్టు ఇంకా ప్రమాద స్థితిలోనే ఉంది. దీంతో అటువైపు ఎవరూ వెళ్లడం లేదు. వాతావరణం తెరిపివ్వడంతో అధికారులు గ్రామాలకు వెళ్లి జరిగిన నష్టంపై ఆరా తీస్తున్నారు. విప్ నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, ఇన్‌ఛార్జి రామరాజు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ గ్రామాల్లో పర్యటించారు. మొగల్తూరులో తీరం వెంబడి వాతావరణం గురువారం వేకువ జాము నుంచి కొద్దిసేపు బలమైన గాలులువీచాయి.తీరం వద్ద గల కొబ్బరి, సరుగుడు చెట్లు పలు ప్రాంతాల్లో కూలి పోయాయి. సాగరతీరంలో వేళాంకిణి మాత ఆలయం నుంచి పేరుపాలెం మోళ్ళపర్రు కనకదుర్గ బీచ్ వరకూ సముద్రంలో అండర్ కరెంట్స్ ప్రభావం ఉండటంతో ఆప్రాంతంలో ప్రత్యేక పహరా కాశారు. మత్యకారులు సముద్ర వేటకు వెళ్ళకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకున్నారు. కేపీ పాలెం, పేరుపాలెంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఈదురు గాలులకు చింత, ఉసిరి, టేకు, నల్ల ఇరుగుడు, మామిడి జాతులకు చెందిన అనేక వృక్షాలు నేలకొరిగాయి. పేరుపాలెం బీచ్‌లో సందర్శకులు రాకుండా గురువారం పోలీస్ బందోబస్త్ నిర్వహించారు. బీచ్‌కు వెళ్ళే మూడు రోడ్లలో సుమారు అర కిలోమీటరు ముందుగానే సముద్రం చూసేందుకు వచ్చే వారిని ఎస్ఐ జి.వాసు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వెనుకకు పంపారు.



నేషనల్ స్పేస్ వీక్‌కు ఎంపికైన భార్గవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నేషనల్ స్పేస్ వీక్ ప్రోగ్రామ్‌కు తణుకు బాలురోన్నత పాఠశాల విద్యార్థిని ఎంపిక

తణుకు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సొసుపల్లి ధనభార్గవి నేషనల్ స్పేస్ వీక్ ప్రోగ్రామ్‌కు ఎంపికైంది. గురువారం స్కూలులో విద్యార్థినిని హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు. పాలిషెడ్‌తో ఫార్మింగ్ ద్వారా నీటి వృథా నియంత్రణకు సంబంధించి రూపొందించిన ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ తరపున ఢిల్లీలో వచ్చేనెల 6 నుంచి 8 వరకు మూడు రోజులు పాటు జరిగే సైన్సు ఎక్స్‌పోకు ఎంపికైనట్లు వివరించారు. గైడ్ టీచరు మాధవీలత, డీవైఈవో మురళీ సత్యనారాయణతో పాటు ఎంఈవో ఆంజ నేయులు, పాఠశాల ఎస్‌ఎంసీ సభ్యులు విద్యార్థిని అభినందించారు.

అథ్లెటిక్స్‌లో ఎస్‌కేఎస్‌డీ విద్యార్థిని ప్రతిభ



తణుకు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాలికల అండర్-19 అథెటిక్స్ పోటీల్లో తణుకు ఎస్‌కెఎస్‌డీ జూనియర్ కళాశాల విద్యార్థిని కె.నందినీ రిలేలో ద్వితీయస్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.హిమబిందు తెలిపారు. ఈనెల 22,23 తేదీల్లో పెదవేగి గురుకుల కళా శాలలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపినట్టు చెప్పారు. కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

క్రీడా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నగదు ప్రోత్సాహక పథకం కింద అర్హులైన వారికి పారితోషికం అందించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రకటించింది. ఇందుకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం గర్వించేలా పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు నవంబర్ 4వ తేదీలోగా తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. sports.ap.gov.in/registration లింకు ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరింత సమాచారానికి 82473 02497 నంబర్‌లో సంప్రదించాలని అజీజ్ విజ్ఞప్తి చేశారు.



డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు వినతిపత్రం అందిస్తున్న సొసైటీ అధ్యక్షులు

గోనె సంచులు, కమీషన్ ఇబ్బందులు తొలగించాలి

పాలకోడేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోళ్లతోపాటు గోనెసంచులు, దాని ద్వారా వచ్చే కమీషన్ ఇబ్బందును తొలగించి సహకారం బ్యాంక్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పలు సొసైటీల అధ్యక్షులు గురువారం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు వినతిపత్రం అందించారు. సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ ఆ సంచులను సొసైటీలే రప్పించుకుని రైతులకు అందించాలన్నట్లుగా జిల్లా అధికారులు చెప్పడం దారుణమన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని సొసైటీ బ్యాంకులకు ధాన్యం కొనుగోలులో రావలసిన కమీషన్ మొత్తం రూ. 70 కోట్లు ఉందని ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. స్పందించిన డీప్యూటీ స్పీకర్ కమిషనర్ అహ్మద్ బాబుకు ఫోన్ ద్వారా వీరి సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని తెలిపారు. సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు వేగేశ్న కనకరాజు సూరి, కొత్తపల్లి నాగరాజు, నంద్యాల రామరాజు, కలిదిండి కృష్ణంరాజు, బాలాజీ, ప్రణవమూర్తి, వేణు, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారునిగా అంబికా రాజా



అంబికారాజాను సత్కరించిన రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు రూరల్, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, అంబికా గ్రూప్ సంస్థల డైరెక్టర్ అంబికా రాజా ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారునిగా నియమి తులయ్యారు. అంబికా భవన్‌లో గురువారం ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, అంబికా రాజాను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు.అంబికా గ్రూప్ సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ, ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు, ఒబిలిశెట్టి శ్రావణ్ కుమార్‌గుప్తా,జనసేన నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న నిట్ ఆచార్యులు

పెంటపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణ లపై దృష్టి సారించాలని తాడేపల్లిగూడెం నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్ రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్కిల్ స్పార్క్ 1.0 అనే అంశంపై రెండు రోజులు నిర్వహించినున్న వర్క్ షాప్ గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శ్రీఫణికృష్ణ అధ్యక్షత వహించగా దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం పాటు పడా లన్నారు. డీన్‌లు డాక్టర్ జయరాం, వీ.సందీప్‌లు మాట్లాడుతూ విద్యార్థులు ఏరంగంలో రాణించాలన్నా ప్రాథమిక అంశాలపై అవగాహన, నైపుణ్యాలపై పట్టు సాధించాలన్నారు. కోఆర్డినేటర్లుగా డాక్టర్ శంకర్ , డాక్టర్ రమేష్ , డాక్టర్ కిరణ్ వ్యవహరించారు.

పోలీసులంటే భయం పోగొడతాం

» ప్రజలతో మమేకమై గౌరవాన్ని పెంచుతాం : ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప శివకిశోర్

ఏలూరు క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'పోలీస్ అంటే ఇప్పటి వరకు ప్రజల్లో ఒక భయం ఉంది. ఆ భయాన్ని పోగొట్టి క్షేత్రస్థాయిలో ప్రజలకు దగ్గరై పోలీస్‌పై గౌరవ మర్యాదలు పెంచడానికి ప్రజలతో మమేకం అవ్వడానికి పోలీస్ ఓపెన్‌హౌస్ ఏర్పాటు చేశాం' అని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని సెయింట్ థెరిస్సా హైస్కూలు విద్యార్థిని మాగంటి కల్యాణి చేత ప్రారంభింప చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులతో ముచ్చటించారు. పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, డ్రోన్ పరికరాల పని తీరు, శక్తిటీమ్ విధులను విద్యార్థుల కు వివరించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్య నభ్యసించాలని చిన్ననాటి నుంచే ట్రాఫిక్ నిబంధ నలు, చట్టాలపై అవగాహన పెంచుకో వాలన్నారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ డీఎస్పీ చంద్ర శేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్ బాషా, ఏలూరు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, జిల్లా పోలీస్ అధికారుల సంఘ నాయకులు ఆర్. నాగేశ్వరరావు, శానం రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బాంబు గురించి వివరిస్తున్న పోలీస్ సిబ్బంది



మైకుతో కంప్లైంట్‌ను రికార్డు చేస్తున్న సిబ్బంది



పోలీస్ డాగ్‌ను చూపిస్తున్న ఎస్పీ





విద్యార్థులకు జాకెట్ ధరించడం వల్ల ఉపయోగాలను వివరిస్తున్న ఫైర్ సిబ్బంది.. విద్యార్థినులకు డ్రోన్ కెమెరా గురించి వివరిస్తున్న సిబ్బంది

వెయిట్ లిఫ్టింగ్‌లో గోపాలకృష్ణయ్య విద్యార్థినుల ప్రతిభ



ఏలూరు రూరల్, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఉన్నత పాఠశాల విద్యార్థినులు గుంటూరులో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారు. పలు విభాగాల్లో ఎం.పావని, బంగారు పతకం, ఎం.దీక్షిత రజిత పతకం, జి.పవిత్ర రజిత, సీహెచ్ కీర్తన బంగారు పతకం సాధించారు. వీరిలో ఎం.పావని, సీహెచ్ కీర్తన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, పాఠశాల హెచ్‌ఎం కాంతి జయకుమార్ తెలిపారు.

అయ్యో పాపం..

పెన్షన్ రాకుండానే దివ్యాంగురాలి మృతి



మాధవి (ఫైల్)

ముదినేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షన్ పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకుండానే ముదినేపల్లికి చెందిన దివ్యాంగురాలు గోన మాధవి(35) తనువు చాలించింది. కొంతకాలంగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న ఆమె గురువారం మరణించింది. ఆమెకు పన్నెండేళ్ల కుమార్తె, పదేళ్ల కుమారుడు ఉన్నారు. పదేళ్ల క్రితం రెండో కాన్పులో బాలింత వ్యాధికి గురై ఆమెకు రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సదరం సర్టిఫికెట్ లభించలేదు. ఆర్థిక ఇబ్బందులతో ఆరోగ్యం క్షీణించి మరణించింది. ఆమె అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

3.195 కేజీల గంజాయి స్వాధీనం

ఆచంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆచంటలో రూ.6 లక్షల విలువ చేసే 3కేజీల 195 గ్రాముల గంజాయితో పాటు ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఆచంట ఎస్ఐ కట్టా వెంకట రమణ తెలిపిన వివరాల ప్రకారం ఆచంట నుంచి మార్టేరు వెళ్లే రోడ్డులో ఆచంటకు సమీపంలో ఒక లేఅవుట్‌లో కొంత మంది గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో అలాగే నరసాపురం స్పెషల్ బ్రాంచ్ సమాచారం మేరకు గంజాయి విక్రయిస్తున్న ఆచంటకు చెందిన కోట భాను సందీప్, పెనుగొండకు చెందిన గెద్దాడ సుభాశ్, ఆచంటకు చెందిన వేములూరి ప్రభాశ్, వల్లూరుకు చెందిన చెల్లెం పృథ్వీరాజ్, పెనుమంచిలికి చెందిన నక్కా బాలకృష్ణ, పెనుగొండ రాజుగూడేనికి చెందిన దేవతల కృష్ణబాబు, ఆచంటకు చెందిన వెలగన వాసు నుంచి ఈ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. పెనుగొండ సీఐ రాయుడు విజయకుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకట రమణ తెలిపారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

నరసాపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని లిఖితపూడి గ్రామంలోని చెరువులో పడి పి.సుబ్బారాయుడు(75) అనే వృద్ధుడు గురువారం మృతి చెందాడు. చెరువులో కాళ్లు కడుక్కునేందుకు దిగి కాలుజారి ప్రమాదశాత్తు లోపల పడిపోయాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో వీఆర్వో రామకృష్ణకు సమాచారం అందించారు. మత్స్యకారులు, ఫైర్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. సాయంత్రానికి మృతదేహం లభ్యమవడంతో బయటకు తీశారు. విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు ఘటనా స్థలానికి వెళ్లారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్.ఐ. వెంకట సురేష్ కేసు నమోదు చేశారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని ఒకరికి గాయాలు

భీమడోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబరుపేట గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ద్వారకాతిరుమల మండలం జాజులకుంట గ్రామానికి చెందిన తానంకి వీర్రాజు అనే వ్యక్తి అంబరుపేట గ్రామం మీదుగా స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా మరో మోటార్ సైకిల్ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీర్రాజు తలకు తీవ్రగాయమవడంతో విజయవాడ తరలించారు.బాధితుడి ఫిర్యాదుతో భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవేంక టేశ్వర స్వామి దర్శనం నిమిత్తం వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగిరాలేదు. అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ కానరాకపోవడంతో ఏలూరు త్రి టౌన్ పోలీసులకు భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి గా లింపు చర్యలు చేపట్టారు. ఏలూరు రామకృష్ణాపురానికి చెందిన జలగం వెంకటేశ్వరరావు(40)కు భార్య అంజలి కుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు. షాపులకు బిస్కెట్లు, తినుబండారాలను మోటారు సైకిల్‌పై తీసుకెళ్లి విక్రయించే వ్యాపారాన్ని చేస్తున్నాడు. ఈ నెల 2న ద్వారకా తిరుమల వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి తి రిగి రాకపోవడం తో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు త్రి టౌన్ సీఐ కోటే శ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఏలూరు కలెక్టరేట్ ఏవో నాంచారయ్యకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఫ్యాప్టో జిల్లా నాయకులు

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌పై స్పష్టత ఇవ్వాలి

» ఫ్యాప్టో జిల్లా నాయకుల డిమాండ్

ఏలూరుఅర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షపై రాష్ట్రప్రభుత్వం స్పష్టతనివ్వాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్యను, డీఈవో వెంకటలక్ష్మమ్మను కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా చైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలని అభ్యర్థిస్తూ ఫ్యాప్టో రాష్ట్రనాయకత్వం ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసిందని, ప్రభుత్వం తరఫున పిటిషన్‌లో ఇంప్లీడ్ కావాలని డిమాండ్ చేశారు. టెట్ తప్పనిసరిపై ఉపాధ్యాయుల్లో ఆందోళన, అయోమయం నెలకొన్నాయన్నారు. పరీక్షనుంచి మినహాయింపునకు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైతే చట్టంలో సవరణలు చేసేలా రాష్ట్రప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పాత పెన్షన్ పునరుద్ధరణ, డీఏ బకాయిల చెల్లింపు, పీఆర్సీ అమలు, ఐఆర్ ప్రకటన, తదితర డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా నాయకులు వెంకటేశ్వరరావు, మనోజ్‌కుమార్, ప్రకాశరావు, రవికుమార్, పవన్‌కుమార్, రామారావు, శివరామ్, శ్రీనివాసరావు, వెంకటరమణ, విద్యాసాగర్, ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎంల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైశ్య ఫెడరేషన్ అభివృద్ధికి కృషి చేస్తా

» సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వట్టిపల్లి



వి. వెంకటేశ్వరరావు

టి.నరసాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వట్టిపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. కె.జగ్గవరం గ్రామంలో గురువా రం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాటా డుతూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోనా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రామ్మోహనరావులు తనను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. తను గతంలో కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ ఏపీ టెలికాం అడ్వైజరీబోర్డు వైస్ చైర్మన్, రైల్వే బోర్డు మెంబర్‌గా పదవులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అంకితభావంతో వైశ్య ఫెడరేషన్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన వైశ్య సంఘ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పదవికి వన్నెతెచ్చే విధంగా శక్తివంచన లేకుండా అందరూ సూచనలు, సలహాల మేరకు ఇంటర్నేష నల్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

సీపీఎం నాయకుడు బాబూరావు గుండెపోటుతో మృతి



నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ బొలిశెట్టి.. చింతకాయల బాబూరావు(ఫైల్)

తాడేపల్లిగూడెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు(63) గురువారం రాజమండ్రిలో గుండె పోటుతో మృతిచెందారు. ఆయనకు ఆరేళ్లక్రితం బైపాస్ సర్జరీ జరిగింది. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. మూడ్రోజుల నుంచి జ్వరంగా ఉండటంతో తాడేపల్లిగూడెంలోనే నివాసం ఉంటున్నారు.గురువారం ఉదయం ఛాతిలో కొద్దిగా నొప్పిరావడంతో రాజమండ్రిలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన పార్థివ దేహాన్ని పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు సందర్శనార్థం తాడేపల్లిగూడెంలోని సుందరయ్య భవనంలో ఉంచారు. సాయంత్రం ఆయన నివాసానికి తరలించారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు శుక్రవారం బాబూరావు పార్థివదేహాన్ని ఏలూరులోని ఆశ్రం కళాశాలకు అప్పగించనున్నారు. సీపీఎం, సీఐటీయూ విభాగంలో కార్మికుల తరఫున పోరాడి పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సుందరయ్య భవనంలోని బాబూరావు భౌతిక కాయాన్ని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు. కార్మిక లోకానికి బాబూరావు మృతి తీరని లోటన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.బలరాం, సీపీఎం సీనియర్ నాయకులు మంతెన సీతారాం, వి.ఉమామహేశ్వరరావు, ఎం.సూర్యారావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.సుబ్బరావమ్మ, పి.అజయ్ కుమార్, కార్యదర్శి నరిసింహరావు, ధనలక్ష్మి, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, సీపీఎం జిల్లా కార్యదర్శి జేవీఎన్ గోపాలన్, కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు దూసనపూడి సోమసుందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకుడు మామిడి దానప్రసాద్, కళింగ లక్ష్మణరావు, మండల నాగేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి: ఎస్పీ



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి నెల వారీ నేర సమీక్షను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, డీఎస్పీలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళా, పిల్లల భద్రత, చిన్నపిల్లల ఫిర్యాదులపై శ్రద్ధ చూపాలని, పోక్సో గంజాయి కేసుల విచారణ వేగవంతంగా చేయాలన్నారు. జూదం, కోడి పందాలు, రికార్డింగ్ డ్యాన్సలు, అశ్లీల ప్రదర్శనలపై అవసరమైతే క్రిమినల్ కేసులు, రౌడీ, సస్పెక్ట్ షీట్లు తెరవాలన్నారు. తరచూ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలని, మద్యం షాపులు నిర్ణీత సమయాల్లో మాత్రమే తెరచి ఉండాలని అన్నారు. ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్ బాషా పాల్గొన్నారు.

మృతి చెందిన మేకలు కోసి విక్రయానికి తరలింపు

» అడ్డుకున్న పంచాయతీ కార్యదర్శి

అత్తిలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అత్తిలి శివారు బొంతువారిపాలెం వెళ్లే రోడ్‌లో మృతి చెందిన మేకలను కోసి విక్రయిస్తున్నారనే ఫిర్యాదుతో అత్తిలి పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పరిశీలించారు. తమ పరిశీలనలో నిజమేనని తేలిందని, రేలంగిలో విక్రయిస్తుండగా అడ్డుకున్నట్టు భాస్కర్ తెలిపారు. ఇప్పటి వరకు ఎనిమిది చనిపోయిన మేకలను కోశారని, మరో ఐదు కోయడానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ విధంగా మేకలను కోస్తున్న నలుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు భాస్కర్ తెలిపారు. మృతి చెందిన వాటిని కోసి విక్రయించడం చట్ట రీత్యా నేరమన్నారు.

సప్తగోకులం సమీపంలో పాము కాటుకు ఆవు, దూడ మృతి!



మృతి చెందిన ఆవు, దూడ

ద్వారకాతిరుమల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయ సప్తగోకులం వెనుక దేవస్థానానికి చెందిన ఆవు, దూడ గురువారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. ఇవి విద్యుత్ షాక్‌తో మృతి చెంది ఉంటాయేమోనని ముందు భావించారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి వచ్చిన రెండు పాములను గుర్తించి హతమార్చినట్టు చెబుతున్నారు. దీంతో అవి పాము కాటుకు మృతి చెంది ఉంటాయని భావిస్తున్నారు. అనంతరం సిబ్బంది, పశు వైద్యులు దానిని పోస్టుమార్టానికి తరలించారు. ప్రతి రోజూ ఉదయం గోపూజ నిమిత్తం గో సంరక్షణశాల నుంచి 9 ఆవులు, 9 దూడలు సప్తగోకులం వద్దకు వస్తాయి. ఈ క్రమంలో ఉదయం ముందుగా వచ్చిన ఆవు దూడలు కాసేపటికి ఐమాస్ట్ పోల్ వద్ద మృతి చెంది ఉన్నాయి. వాటి సమీపంలో పాములు ఉన్నట్టు గుర్తించి వాటిని సిబ్బంది కొట్టి చంపినట్టు అధికారులు చెబుతున్నారు.. దీంతో పాము కాటు వల్లే ఆవు, దూడ మృతిచెంది ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు శాంపిల్స్‌ను విజయవాడలోని వీబీఆర్ఎల్ లేబరేటరీకి పంపుతామని అక్కడి నుంచి వచ్చే పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా వివరాలు వెల్లడిస్తామని పశు వైద్యులు అంగర సురేష్ తెలిపారు.

భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదు

ఏలూరుక్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై భార్యను అనుమానిస్తూ మానసికంగా, శారీరకంగా వేధించి రాడ్డుతో తలపై మోది హతమార్చిన భర్తపై నేరం రుజువు కావ డంతో జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధి స్తూ ఏలూరులోని రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం టి.నర్సాపురం మండలం, గ్రామానికి చెందిన కోడూరి మణికంఠ స్వామి(29) చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. 2019 జులై 17 రాత్రి ఇంట్లో గొడవపడి రాడ్డుతో భార్య తలపై మోది హతమార్చాడు. ఈ సంఘటనపై అప్పటి చింతల పూడి సీఐ పి.రాజేశ్ కేసు నమోదు చేసి భర్త మణికంఠస్వామిని అరెస్టు చేశారు. ఏలూరులోని రెండవ అదనపు సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. మణికంఠ స్వామిపై కేసు రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి యు.ఇందిరా ప్రియదర్శిని గురువారం తీర్పు చెప్పారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



ఏలూరు క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఒక యువకుడు మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులకు అందిన సమాచారంతో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరవల్లి రైలు పట్టాలపై 30 ఏళ్ల యువకుడు మృతి చెంది ఉన్నాడు. వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారి పడి మృతి చెందినట్టు ప్రాథమికంగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిస్తే రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ సెల్ నెంబర్ 97047 98990కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సోమేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం

భీమవరం టౌన్,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):కార్తీకమాసం (కోటి సోమవారం)గురువారం పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకారం చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో తెల్లవారుజామున అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. ఆలయ ఈవో డి రామకృష్ణంరాజు, ఛైర్మన్ చింతలపాటి బంగ్రారాజు పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు నోటిఫికేషన్

కాళ్ళ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ మండలంలో అంగన్‌వాడీ సహాయకురాళ్ళ నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని, నవంబర్ 5వ తేదీలోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.తులసి తెలిపారు. బొండాడపేట (బీసీ-బీ), కాళ్ళ (బీసీ-డీ) అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పదవ తరగతి చదువుకుని, 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. వికలాంగులు, అంగవైకల్యం కలిగిన వారికి సడలింపు ఉంటుందని ఆమె తెలిపారు.

స్వాముల భిక్షకు రూ.1,05,000 విరాళం



ఆకివీడు రూరల్ అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): కుప్పనపూడి గ్రామంలో కొప్పేశ్వర స్వామి ఆలయంలోని ముత్యాల రమాకాంతమ్మ, మాణిక్యం కమ్యూనిటీ హాలులో నెలరోజులుగా అందజేస్తున్న ఉచిత భిక్ష కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు మోటుపల్లి సాయి అరవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భిక్ష కోసం తనవంతుగా రూ.1,05000 వేలు విరాళంగా అందజేశారు. ప్రతి రోజు సుమారు 500మంది అయ్యప్ప, శివ, గోవింద, భవానీ దీక్షాదారులు భిక్ష స్వీకరిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. డీసీసీబీ మాజీ ఛైర్మన్ ముత్యాల రత్నం, నిర్వాహకులు నూకల రాందాసు, మాదివాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ వెలివెల శివ, సుఖాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



పెద అమిరంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులందిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

కాళ్ళ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెద అమిరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 31 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం 'ముఖ్యమంత్రి సహాయ నిధి' నుంచి మంజూరైన రూ. 15,55,479 సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం లబ్ధిదారులకు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అందించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

తణుకు: క్యాంపు కార్యాయలంలో నియోజవర్గంలోని 68 మందికి 29.61లక్షల విలువగల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తణుకు, అత్తిలి ఏఎంసీ ఛైర్మన్‌లు కొండేటి శివ, దాసం ప్రసాద్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పెనుగొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను పెనుగొండ ఏఎంసీ ఛైర్మన్ బడేటి బ్రహ్మజీ గురువారం పరిశీలించారు. తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ప్రతి రైతుకు పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. రామన్నపాలెంలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్నబోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మొఖమట్ల కృష్ణకాంత్, కూటమి శ్రేణులు ఉన్నారు.

ఆర్యవైశ్య పొలిటికల్ అఫైర్స్ ఛైర్మన్‌గా పర్రిపాటి



నియామకపత్రం చూపుతున్న పర్రిపాటి

భీమవరం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్‌గా భీమవరానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు పర్రిపాటి శ్రీనివాస్ నియమి తులయ్యారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోనా శ్రీనివాసరావు, గోంట్ల రామ్మోహనరావులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ ఐక్యత, గుర్తింపు, హక్కుల పరిరక్షణ కోసం కట్టుబడి పని చేస్తానని అన్నారు. భీమవరం నుండి రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు స్వీకరించడంతో ఆనందంగా ఉందని అన్నారు. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ గాను, వాసవి జాగృతి విజేఎఫ్ అధ్యక్షుడి గాను, భీమవరం రూరల్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా, హ్యూమన్స్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పెంటపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరీదేవి ఉత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద ద్వారాకా తిరుమల వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కన్నుల పండువ గా నిర్వహించారు. తొలుత తిరుపతి నుంచి వచ్చిన ప్రత్యేక వాహనంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా నడుమ గ్రామంలో ఊరేగింపు జరిపారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ స్వామి వారి కల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

నందీశ్వర స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ



తణుకు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తణుకు పాతూరులో పార్వతి కపర్దీశ్వర స్వామి ఆలయంలో గురువారం నందీశ్వర స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయంలో మూడు రోజుల పాటు దీక్ష అనంతరం నందీశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వంశపారంపర్య ధర్మకర్త నల్లజర్ల వెంకన్న కుటుంబ సభ్యులు పూజలో పాల్గొన్నారు. వేద పండితులు అల్లవరపు గిరి శంకర్, మధుశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా గాయత్రి మంత్రం పఠించాలి



గాయత్రిమాత వద్ద పూజలు చేస్తున్న తోట సీతారామలక్ష్మి, ఏఎంసీ ఛైర్మన్ సుజాత

భీమవరం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా గాయత్రి మంత్రం పఠించాలని, సకల వేదాలకు, జ్ఞానానికి మూలం గాయత్రీ దేవి అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. పెద అమిరంలో గాయత్రి పరివార్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 108 కుండముల జ్ఞాన గాయత్రి మహాయజ్ఞ కార్యక్రమంలో భాగంగా గురువారం మూడు (స్థూల, సూక్ష్మ, కారణ) శరీరక సాధన నిర్వహించారు. సీతారా మ లక్ష్మీ మాట్లాడుతూ గాయత్రి మంత్రాన్ని జపించడం ద్వారా మానసిక ఆధ్యాత్మిక శక్తి పెరు గుతుందని, రాష్ట్ర సుభిక్షం కోసం 5 రోజుల పాటు 108 కుండముల జ్ఞాన గాయత్రి మహాయజ్ఞం నిర్వ హించడం శుభ పరిణామమన్నారు. ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి సుజాత మాట్లాడుతూ యజ్ఞాలతో ప్రకృతి వైపరీత్యాలను అరికట్ట వచ్చునని అన్నారు. యజ్ఞ కన్వీనర్ వేగేశ్న రమేష్ వర్మ, సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దేశంలో16 కోట్లమంది గాయత్రి భక్తులున్నారని తెలిపారు.

శాంతి కల్యాణం

భీమవరం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు పర్యవేక్షణలో వైఖానస ఆగమ ప్రకారం జరిపించారు. భక్తులు తిలకించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంటలు కాపాడుకోవాలి



రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు

ముంపు పొలాలు పరిశీలన

పాలకొల్లు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నేలకొరిగిన వరిచేలను వ్యవసా యాధికారులు ఇచ్చిన సలహాలు సూచనలు పాటించి రైతులు జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు పాలడుగు సత్యనారాయణ కోరారు. లంకలకోడేరు, వెదుల్లపాలెం, వెంకటాపురం గ్రామాలలో పాలు పోసుకొనే దశ నుంచి కోత దశ వరకు ఉన్న స్వర్ణ, సంపద స్వర్ణ రకాలు తుఫాన్ తాకిడికి నేలకొరగడంతో గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వర్షం అనంతరం రైతులు చేపట్టవలసిన చర్యలను వివరించారు. వీలైనంత త్వరగా పొలంలో నిలిచిన నీటిని బయటకు తోడాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.శ్రీనివాస్, డాక్టర్ మల్లి ఖార్జునరావు, డాక్టర్ గిరిజారాణి, ఏడీఏ మురళీకృష్ణ, ఏవో రాజశేఖర్ పాల్గొన్నారు.

ముంపు పొలాలు పరిశీలన

పాలకోడేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలుల వల్ల పడిపోయిన వరి దుబ్బులను ఒకదానికొకటి కట్టి పైరును నిలబెట్టుకుని పంట పొలంలోని నీరును తగ్గించుకోవడం ద్వారా నష్టాన్ని నివారించుకోవచ్చని భీమవరం సహాయ వ్యవసాయ సంచాలకులు జి.శ్రీనివాసరావు అన్నారు. మోగల్లు గ్రామంలో తుఫాన్ వల్ల పడిపోయిన పంట పొలాలను గురువారం పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. తహసీల్దార్ భారతి విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి సంధ్య, ఏవో బాలనాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

యలమంచిలి: నేలకొరిగిన, ముంపుబారిన పడ్డ వరిచేలల్లో నీటిని వెంటనే బయటకు మళ్లించిన అనంతరం తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నరసాపురం ఏడీఏ పి.వి.వి.ఎన్.ఎస్.పి.ప్రసాద్ రైతులకు సూచించారు. మొంథా తుఫాను ప్రభావంతో చించినాడ, యలమంచిలి గ్రామాల్లో ముంపుబారిన పడ్డ వరిచేలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడిపోయిన చేలల్లో అంతర్గత కాలువల ద్వారా బయటకు మళ్లించాలని, ముంపు సమస్య తీవ్రంగా ఉంటే మోటార్లతో నీటిని బయటకు పంపాలని తెలియజేశారు. పడిపోయిన వరిదుబ్బులను సాధ్యమైనంతవరకూ పైకిలేపి కట్టుకోవాలని వివరించారు. మాగుడు తెగులు, మానిపండు తెగులు వ్యాప్తిచెందకుండా ఉండేందుకు ఎకరాకు 200మిల్లీలీటర్ల ప్రొపికొనజోల్ పిచికారీ చేసుకోవాలని చెప్పారు. దుబ్బుల దశలో ఉన్న వరిచేలల్లో నీరు తగ్గిన వెంటనే ఎకరానికి యూరియా 20కిలోలు, పొటాష్ 20కిలోలు చల్లుకోవాలని రైతులకు వివరించారు.

కాళ్ల: తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటను శాస్త్రవేత్తల బృందం గురువారం పరిశీలించారు. కాళ్ళ మండలం వేంపాడు, కోపల్లె, జక్కరం గ్రామాల్లో మార్టేరు వరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు రోజా, సునీత, ఆనంద్ కుమార్, ఉండి కేవీకే శాస్త్రవేత్త విజయలక్ష్మి స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. నీట మునిగిన విత్తనపంట, ఈనిక దశలో ఉన్న పంటలను పరిశీలించి తెగుళ్ళ బారినపడకుండా రైతులకు పలు సూచనలు చేశారు. కాళ్ళ మండలంలో 3700 ఎకరాల్లో సాగు జరుగుతుందని, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటను అంచనా వేస్తున్నామని ఏవో పి.రమేష్‌నాయుడు తెలిపారు.

80శాతం విద్యుత్ పునరుద్ధరణ



నరసాపురంలో విద్యుత్ పనులు

నరసాపురం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి)నరసాపురం రూరల్, సీతారాంపురం,మొగల్తూరు మండలాల్లోని తొమ్మిది సబ్‌స్టేషన్‌ల పరిధిలో 80శాతం విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో ఏడీఈ రాజీవ్ తెలిపారు. తుఫాన్ కారణంగా ఈ మండలాల్లో సుమారు 40 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. విద్యుత్ లైన్లు, కేబుల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోయారన్నారు. వీటిని సరి చేసి విద్యుత్‌ను అందించేందుకు చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి 150 మంది సిబ్బంది నిరంతరం పని చేస్తున్నారన్నారు.

రైతుల్ని ఆదుకోవాలి

ఆచంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):తుఫాన్ కారణంగా నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి పి. మోహనరావు కోరారు. గురువారం సీపీఎం బృందం ఆచంటలో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ మండలంలో సుమారు 600 ఎకరాలు పైగానే నేలకొరిగిందని ఇప్పటికే ఎకరానికి రూ. 25 వేలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టారని తెలిపారు. ప్రభుత్వం తక్షణం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



నరసాపురం రూరల్‌లో మునిగిన పొలాలు పరిశీలిస్తున్న విప్ నాయకర్

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

నరసాపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని విప్ నాయకర్ భరోసా ఇచ్చారు. గురువారం సరిపల్లి, లిఖితపూడి, కొప్పర్రు, వైఎస్‌పాలెం, ఎల్‌బిచర్ల గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడుతో కలిసి వర్షాలు, గాలులకు దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించారు. జరిగిన నష్టంపై రైతుల నుంచి ఆరా తీశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రాథమిక సర్వే ప్రకారం 6500 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఆక్వా నష్టాన్ని కూడా సర్వే చేస్తున్నామన్నారు. రోడ్లు కూడా సర్వే చేసి గోతుల్ని పూడ్చివేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. తిరిగి సాగు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. కార్యక్రమంలో షైలా వసంతరావు, ఏఎంసీ ఉపాధ్యక్షులు గంగాధర్, కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని, బందెల రవీంద్ర, ఏవో జ్యోషిల, చంద్రశేఖర్, శ్రీధర్, కృష్ణవేణి పాల్గొన్నారు.

మొగల్తూరు:నవుడూరు గరువు, కోట వద్ద వరి చేలను పరిశీలించి రైతులతో ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడారు. నియోజకవర్గంలో జరిగిన పంట నష్టం వివరాలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళతామన్నారు. ఇప్పటికే పంట నష్టంపై అంచనాలు రూపొందించాలని ఆదేశించామని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, జిల్లా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు, సొసైటీ ఛైర్మన్ నిప్పులేటి తారక రామారావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, షైలాబత్తుల రాంబాబు, గూడూరి మావుళ్ళు పాల్గొన్నారు.

ముంపులోనే లోతట్టు ప్రాంతాలు



మొగల్తూరు ఉన్నత పాఠశాలలో ముంపు నీటిని ఇంజన్ల సహాయంతో తోడుతున్న పంచాయతీ సిబ్బంది

మొగల్తూరు, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ ప్రభావం, అంతకు ముందు వరుసగా కురిసిన వర్షాలతో తీర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, నివాసాల మధ్య ముంపు నీరు నిలిచిపోయింది. మొగల్తూరు ఉన్నత పాఠశాల, కోట్ట, రాజ్యలక్ష్మీ అమ్మవారి కాలనీ, పడమటిపాలెం, భవానీ కాలనీ, ప్రతిభా స్కూల్ వీధి, హనుమాన్ టెంపుల్ ప్రాంతాలతో పాటు, కాళీపట్నం తూర్పు, పడమర, కెపిపాలెం, పేరుపాలెం, కొత్తకాయలతిప్ప గ్రామాల్లో వర్షం నీరు నిలిచి ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఆదర్శకాలనీల్లో ముంపునీటి ప్రభావం నివాసాల మధ్య ఎక్కువగా ఉండటంతో దోమలబెడద పెరిగి ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మొగల్తూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో ముంపు నీటిని ఇంజన్ల సహాయంతో బయటకు తోడుతున్నారు

నిత్యావసర సరుకులు సిద్ధం



వరద బాధితుల కోసం సిద్ధం చేస్తున్న నిత్యావసర సరుకులు

నరసాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితుల కోసం నిత్యావసర వస్తువుల్ని సిద్ధం చేస్తున్నారు. రైతు బజార్‌లో ఈపని చేపట్టారు. ఇందులో సిబ్బందితో పాటు టీడీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఉల్లిపాయలు, పంచదార, కందిపప్పు, బంగాళదుంపల్ని సంచుల్లో వేస్తున్నారు. మొత్తం 20వేల సంచుల్ని సిద్ధం చేశారు. శుక్రవారం గ్రామాల్లోకి వెళ్లి నాలుగు నిత్యావసర వస్తువులతో పాటు కేజీ ఆయిల్ ప్యాకెట్‌ను కూడా ఇవ్వనున్నారు. ఈపనుల్ని టీడీపీ ఇన్‌చార్జి రామరాజు, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, బర్రె ప్రసాద్, కొప్పాడ రవి పర్యవేక్షించారు.

బాధితులకు సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలను ఏ ప్రభుత్వం కూడా నిరోధించ లేదని, కానీ వాటి వల్ల కలిగే నష్ట తీవ్రతను తగ్గించడం సమర్థవంతమైన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పు డే సాధ్యమవుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలోని దుర్గాపురంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం, నిత్యావసర వస్తువులను జిల్లా కలెక్టర్ నాగరాణితో కలిసి కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలను అందజేశారు. డిప్యూటీ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎమ్మార్వో రాంబాబు పాల్గొన్నారు.

పోలీసుల విధి విధానాలపై అవగాహన

గణపవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని శాంతి భద్రతలు పర్యవేక్షించేందుకు పోలీసులు శ్రమిస్తారని దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని ఎస్‌ఐ ఎ.మణికుమార్ అన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం గణపవరం పోలీస్ స్టేషన్‌లో కళాశాల విద్యార్థులకు పోలీస్ వ్యవస్థలో విధివిధానాలు, సెక్షన్లు, ఆయుధాలు, విధినిర్వహణలో పోలీసు అమర వీరుల త్యాగాలపై అవగాహన కల్పించారు.

బాధితులకు బీమా చెక్కులు అందజేత

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని భవన, కార్మిక సంక్షేమ మండలి ఛైర్మన్ వలవల బాబ్జి అన్నారు. తెలుగుదేశం సభ్యత్వం తీసుకుని ప్రమాదాలలో మృతి చెందిన పెంటపాడు గ్రామానికి చెందిన దారం గంగాధరరావు, పెదతాడేపల్లికి చెందిన పొలిశెట్టి అజయ్‌కుమార్, పట్టణంలోని షేక్ మస్తాన్ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున మొత్తం రూ.15 లక్షల బీమా చెక్కులను పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద అందజేశారు.

కార్మికులకు పథకాలు అమలు చేయాలి

తాడేపల్లిగూడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలో గురువారం జరిగిన ఐఎఫ్‌టీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబరు 1వ తేదీ నుంచి 4 వరకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర రాజకీయ తరగతులు, రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయన్నారు. శ్రేణులు వీటిని విజయవంతం చేయాలని కోరారు.

డ్రెయిన్‌లలో చెత్త తొలగింపు

ఉండి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):వర్షాలకు పూడుకుపోయిన డ్రెయిన్లు, పేరుకున్న చెత్త తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ కమతంసౌజన్యబెనర్జి, డిస్ట్రిబ్యూటరీ కమిటి ఉపాధ్యక్షుడు మంతెన సాయిలచ్చిరాజు, మండల టీడీపీ, గ్రామ టీడీపీ అధ్యక్షులు కరిమెరక నాగరాజు, కాగిత బుజ్జి పరిశీలించారు. హైస్కూల్ ప్రాంతంలోను, పెదపేట వాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలను తీసుకున్నారు. గ్రామంలోని పలుచోట్ల ముంపుకు గురైన ప్రాంతాలలో చెత్తను తొలగించారు.

బాబూరావు మృతికి సీపీఎం నివాళులు

ఆచంట, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడిన ప్రజా ఉద్యమ నేత కామ్రేడ్ చింతకాయల బాబూరావు ఆకస్మిక మృతి సీపీఎం పార్టీకి, కార్మిక లోకానికి తీరని లోటని మండల కార్యదర్శి మోహనరావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాలులు అర్పించారు.

ఉద్యాన పంటలు కాపాడుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):తుఫాన్ ప్రభావంతో వర్షాలకు దెబ్బతినే ఉద్యాన పంటలను కాపాడుకోవడానికి రైతులు తగు చర్యలు చేపట్టాలని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన పంటలకు శాస్త్రవేత్తలు మధుమతి, రమేశ్‌బాబు సూచించారు. కడియద్ద, బంగారుగూడెం గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న అరటి, బొప్పాయి, తదితర పంటలను మండల ఉద్యాన అధికారి శ్రీలక్ష్మితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

ఉండి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):మతిస్థితిమితం లేని మహిళ ఆచూకీ కోసం పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవే. ఉండి గ్రామానికి చెందిన కుమ్మరిగుంట కుమారి(20) మానసిక వైకల్యంతో బాధపడుతూ గతంలో మతిస్థితిమితం లేక రెండు మూడుసార్లు చెప్పకుండా ఇల్లు వదిలి బయటకు వెళ్లి మళ్లీ ఇంటికి తిరిగి వచ్చినట్లు పోలీసులకు తెలిపారు. ఈనెల 22వ తేదీన రాత్రి 9గంటలకు తన తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో పడుకున్నట్లు మరుసటిరోజు 23వ తేదీ తెల్లవారు జామున 4గంటల సమయంలో తన కుమార్తె లేకపోవడంతో వారు కంగారుపడ్డారు. ఆమె గురించి వాకబు చేసినా ఎక్కడ కనిపించలేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తల్లి సువార్త ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవి తెలిపారు.

ప్రీ రిపబ్లిక్ డే శిబిరానికి ఏఎస్ఎన్ఎం విద్యార్థిని



విజయలక్ష్మి

పాలకొల్లు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణంలోని ఏఎస్ఎన్ఎం అటానమస్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని కె.విజయలక్ష్మి ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీరుగా ప్రీ రిపబ్లిక్ డే క్యాంపుకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి గురువారం తెలిపారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లలో ప్రతిభ కనబరచిన కె.విజయలక్ష్మి ఢిల్లీ రిపబ్లిక్ డే పెరేడ్‌కు గుజరాత్‌లో నిర్వహించే పదిరోజుల శిక్షణా శిబిరంలో పాల్గొనబోతోందని ప్రిన్సిపాల్ తెలియజే శారు. ఈ మేరకు కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని కె.విజయలక్ష్మిని అధ్యాపకులు అభినందించారు.

పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

గణపవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):పిప్పర గ్రామానికి చెందిన కొలనువాడ సుబ్బరాజు తన పుట్టినరోజు సందర్భంగా గురువారం గ్రామంలో వృద్ధులు, వికలాంగులు, పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. గ్రామంలో కులమతాలకు అతీతంగా చనిపోయిన వారికి దహన ఖర్చుల నిమిత్తం రూ.2500, గంధపు చెక్క ముక్క ఇస్తూ వచ్చారు. ఇక నుంచి రూ.3వేలు ఇస్తున్నట్లు సుబ్బరాజు ప్రకటించారు.

కొనసాగిన పునరావాస కేంద్రాలు

మొగల్తూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగించారు. మంగళవారం రాత్రి తుఫాన్ తీరం దాటినప్పటికీ ఈదురు గాలులు ప్రభావంతో పేరుపాలెం, కెపిపాలెం, పాతపాడు గ్రామాల్లో 8 పునరావాస కేంద్రాల్లోనూ సుమారు 3000 మంది తుఫాన్ ప్రభావిత ప్రజలకు ఆహారం అందించినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు పెట్టారు.

ఆకివీడులో ఇళ్లకు వెళ్లిపోయిన పునరావాసులు

ఆకివీడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చినకాపవరం మురుగు కాల్వ ఉధృతి తగ్గడంతో పునరావాసులు గురువారం ఇళ్లకు వెళ్ళిపోయారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పాటు ఎగువ నుంచి వచ్చిన వరదతో చినకాపవరం మురుగు కాల్వ పొటెత్తింది. దీంతో సమీప ప్రాంత వాసుల ఇళ్లలోకి నీరు చేరడంతో కూటమి నేతలు, అధికారులు సుమారు 70 కుటుంబాలను పునరావాసానికి తరలించారు. కాల్వలో నీరు తగ్గడంతో ఇళ్ళకు వెళ్ళిపోయారు.

చుక్కలనంటిన కూరగాయల ధరలు



తణుకు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. 30 నుంచి 40 శాతం పెరిగిపోయాయి. పట్టణ శివారు, గ్రామాలల్లో రిటైల్‌గా కూరగాయల రేట్లు అధికంగా వున్నాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. వంకాయలు గరిష్ఠంగా కొన్ని చోట్ల కిలో రూ.120 కాగా కనిష్ఠంగా రూ.100లుగా అమ్మకాలు చేశారు. పచ్చిమిర్చి కొన్ని చోట్ల కిలో రూ. 100 కాగా గ్రామాల్లో రూ. 80లుగా అమ్మకాలు చేశారు. బెండకాయలు, గరిష్ఠంగా కిలో రూ. 120 కాగా, గ్రామాల్లో రూ.100, దోసకాయలు కిలో రూ.100, బీరకాయలు కిలో రూ. 100, గ్రామాల్లో రూ.80, క్యాప్సికం గరిష్ఠంగా రూ.120 కాగా, గ్రామాల్లో రూ.100, 80లుగా అమ్మకాలు చేశారు. ఆదివారం మార్కెట్‌లో వంకాయలు కిలో రూ.80లు, బెండకాయలు రూ. 60, క్యాప్సికం రూ. 80లుగా అమ్మకాలు చేశారు. కిలో రూ. 30లువున్న టమాటాలు ఇప్పుడు రూ. కిలో రూ. 50లకు పెరిగిపోయింది. వీటితో పాటు ఆకు కూరల ధరలు కూడా పెగిపోయాయి. స్థానికంగా పండే కూరగాయల ధరలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే బంగాళా దుంపలు, క్యారెట్ ధరలు కూడా పెరిగిపోయాయి. కిలో రూ. 30లు వున్న బంగాళా దుంపలు ఇప్పుడు రూ. 40లకు, కిలో రూ. 40లు వున్న క్యారెట్ ధర ఇప్పుడు రూ.కిలో రూ. 80లకు పెరిగింది.

కూటమి నేతలకు అభినందన

ఆకివీడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ సమయంలో సహాయక, పునరావాస కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజలకు సహాయక సహాకారాలు అందించిన కూటమి నాయకులు, అధికారులకు, ప్రింట్ అ ండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ గురువారం అభినందనలు తెలిపారు. విపత్తుల సమయంలో బాధితులకు సహకారం అందించాల్సిన అవసరం ఉన్నదన్నారు.